













శ్రీగణనాథం భజామ్యహం

- అన్నింటా ఆది దేవుడే...
- కొరసాల కుంచెలో ఒదిగిన లంబోదరుడు
- 40వేలకు పైగా జాలువారిన గణేశుని చిత్రాలు

సృష్టికి ప్రతి సృష్టి చేయగలవాడే నిజమైన చిత్రకారుడు. తన మనో నేత్రంతో ఒకటికాదు రెండు కాదు వేలాది రూపాల్లో వినాయకుని రూపాలను చిత్రించడం నిజంగా ఓ వింతే. ఇందుగలడు అందులేడని సందేహంబు వలదు.. అన్నట్టు చెట్టు.. పుట్ట.. ఆకులు అలమలు.. రాళ్లు రప్పలు.. పూలు, పండ్లు.. ఇలా ఒక్కటేమిటి అన్నింటా వినాయకుని ప్రతిరూపాలే ప్రతిబింబించడం వింతలకే ఓ వింత. ఇటువంటి మహత్తర కార్యాన్ని చేపట్టారు అమలాపురం పట్టణానికి చెందిన శ్రీకోనసీమ చిత్రకళా పరిషత్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కొరసాల సీతారామస్వామి. ఒకదానితో మరొకటి సంబంధం లేకుండా వినాయకుడు వేల రూపాల్లో కళాత్మకంగా ఆయన కుంచెలో ఒదిగిపోయాడు. చూడగానే స్ఫురించే గణేశుని రూపాలే కాదు కళాత్మకంగా, భక్తితత్వంతో చూస్తేనే గానీ అవగతం కాని విభిన్న రూపాల్లో లంబోదరుడు కొరసాల కుంచెలో ఒదిగిపోయాడు.

.... అమలాపురం టౌన్

సంప్రదాయ, అధునాతన పద్ధతుల్లో...

వినాయకుని ప్రతిరూపాలను చిత్రించడానికి సంప్రదాయ, అధునాతన పద్ధతులను వినియోగించారు సీతారామస్వామి. ఇందుకు ఎన్నో టెక్నిక్స్ ఉపయోగించారు. నైఫ్‌వర్క్, గ్లాస్ పెయింటింగ్, ఉడ్ కార్వింగ్, కొలేజ్, ఎంబోజింగ్, రియలిస్టిక్, యాక్రిలిక్, ఆయిల్ పెయింటింగ్, కలర్ పెన్సిల్స్, ఆబ్‌స్ట్రాక్ట్, వెల్డింగ్ వంటి విధానాల్లో గీసిన చిత్రాలను ఎన్నిసార్లు చూసినా తనివితీరదు.

లక్ష గణేశుని చిత్రాలే లక్ష్యం

కొరసాల సీతారామస్వామి
కోనసీమ చిత్రకళా పరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి



ప్రభుత్వ పాఠశాలలో చిత్రలేఖనం ఉపాధ్యాయునిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశాను. ఆ రోజు నుంచీ లక్ష వినాయకుని చిత్రాలే లక్ష్యంగా జీవితాన్ని ముందుకు సాగిస్తున్నాను. 2007 సంవత్సరంలో వినాయకుని చిత్రాలను ప్రత్యేకంగా గీయడం ప్రారంభించాను. ఇప్పటి వరకు 40వేలకు పైగా గణేశుని చిత్రాలను కాన్వాస్‌లపై ఎక్కించాను. ఎటువంటి విఘ్నాలు లేకుండా లంబోదరుని లక్ష చిత్రాలు పూర్తి చేయగలనన్న ఆత్మ విశ్వాసం మెండుగా ఉంది.

మొదటి శుభలేఖ లక్ష్మీ గణపతికే

బండారులంకలో కొలువైన శ్వేతవర్ణ గణపతి



అమలాపురం రూరల్, సెప్టెంబరు 6: స్వాతంత్రోద్యమ కాలంలో గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తి నింపిన ఘనత బండారులంక చినచంద్రపురంలో వెలిసిన శ్రీలక్ష్మీ గణపతికే దక్కుతుంది. పరిసర గ్రామాల్లోని గృహాల్లో ఏ ఇంట శుభ కార్యక్రమం జరిగినా తొలి శుభలేఖ ఈయనకే అందుతుంది. ఏ విఘ్నాలు లేకుండా శుభ కార్యక్రమాలు జరుగుతాయని ఆ ప్రాంత ప్రజల నమ్మకం. నవ వధూవరులు సుఖసంతోషాలతో ఉండాలని, వారి దాంపత్యానికి ఎటువంటి విఘ్నాలు కలగకుండా సుఖసంతోషాలతో అన్యోన్యంగా ఉండాలని కోరుకుంటూ ఈ ప్రాంత భక్తులు శుభలేఖలను స్వామివారి పాదాలచెంత ఉంచి అభిషేకాలు చేస్తారు. గణపతి నవరాత్రులను పురస్కరించుకుని ఈ నెల 7 నుంచి ఉత్సవాలు ప్రారంభిస్తున్నట్టు సంఘ ప్రతినిధులు ఉప్పుగంటి భాస్కరరావు, కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి, కటకం గణపతిరావు, పడవల ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ నెల 18న అఖండ అన్నసమారాధన అనంతరం స్వామివారి ఉత్సవమూర్తి నిమజ్జనం జరుగుతుంది. పిచ్చిక మల్లికార్జునుడు-సత్యవతి దంపతులు కాశీ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన పాలరాతి శ్వేతవర్ణ గణపతిని దర్శించుకుని తరించిన జాతీయ రాజకీయ నేతలు ఎందరో ఉన్నారు. పన్నెండు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, గీతా ప్రచారకుడు బళ్ల మల్లేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. శ్రీలక్ష్మీగణపతి ఆలయానికి ఏర్పాటు చేసిన అన్నదాన నిధికి దాతలు తమ వంతు సహకారం అందిస్తున్నారని సభ్యులు చింతా పోతురాజు, ఆశపు చిన్ని, పడవల మురహరి, బట్టు ట్యాక్సీరాం, బట్టు పండు తెలిపారు.



కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో విజయవాడ బాధితులకు సహాయం కోసం లారీలో సామగ్రి తరలిస్తున్న దృశ్యం



విజయవాడలో వరద బాధితులకు వస్త్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు



వరద బాధితులను పరామర్శించి భరోసా ఇస్తున్న మంత్రి సుభాష్

ఆపన్నహస్తం



నిరాశ్రయునికి దుప్పటి ఇస్తున్న మంత్రి సుభాష్

- విజయవాడ వరద బాధితులకు సహాయ సహకారాల్లో కోనసీమవాసుల ముందంజ
- నిత్యావసరాలు, ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్లు పంపిణీ
- మంత్రి, ఎమ్మెల్యేలతో పాటు పలు సంస్థలు కూడా

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో కోనసీమవాసులు ఎప్పుడూ ముందుంటారు. ఇటీవల విజయవాడలో సంభవించిన విపత్తుతో నిర్వాసితులైన లక్షలాది మంది బాధితులకు ఆపన్న హస్తం అందించడంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ముందు వరుసలోనే ఉన్నారు. పార్టీలు ఇచ్చిన పిలుపును అందుకుని తమవంతుగా విరాళాలను సేకరించి వరద బాధితులకు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతం నుంచి అధికార కూటమికి చెందిన ప్రజాప్రతినిధులతో పాటు స్వచ్ఛంద సంస్థలు, వివిధ పార్టీల నేతలు తమ వంతు విరాళాలను ప్రజల నుంచి సేకరించి బాధితులకు పంపిణీ చేయడానికి భారీగానే తీసుకెళ్తున్నారు. రాజకీయాలకు అతీతంగా దాతలు ముందుకు వస్తున్నారు. కొందరు కలెక్టర్ ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు చెక్కులు ఇస్తుంటే మరికొందరు విరాళాలు సేకరించి వస్తు రూపంలో బాధిత కుటుంబాలకు ఇస్తున్నారు.

- కొత్తపేట టీడీపీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నియోజకవర్గం నుంచి ఇటీవల భారీగా విజయవాడ వరద బాధితులకు సహాయాలను పంపించారు. కొన్ని కిట్లను తయారు చేయించి బాధితులకు పంపిణీ చేశారు. వాటర్ ప్యాకెట్ల బస్తాలు, బాటిళ్లు, నిత్యావసర వస్తువులు, అరటి గెలలు సేకరించి వరద బాధితుల కోసం సత్యానందరావు, ఆయన అనుచరగణం తరలించారు.
- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో లక్షలాది రూపాయలు విలువైన ఆహార పదార్థాలు, ఇతర నిత్యావసర వస్తువులను విజయవాడ తీసుకెళ్లారు. మంత్రి అక్కడే మకాంవేసి వాటిని స్వయంగా పంపిణీ చేస్తున్నారు. గురువారం రాత్రి స్కూటర్‌పై వెళ్లి ఫుట్‌పాత్‌లపై ఉండే వారికి, పలువురు నిరాశ్రయులకు వెచ్చని వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆహార ప్యాకెట్లు, మంచినీటి బాటిళ్లు అందజేశారు.
- అమలాపురం టీడీపీ ఎంపీ గంటి హరీష్‌మాధుర్ మంత్రి లోకేశ్‌ను కలిసి రూ.5లక్షల చెక్కును వరద బాధితుల సహాయార్థం అందించారు.
- అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును కొన్ని రోజులుగా బెజవాడలోనే మకాం వేసి వివిధ డివిజన్ల పరిధిలోని వరద బాధితులకు ప్రభుత్వం ద్వారా అందుతున్న సహాయ సహకారాలను పరిశీలిస్తున్నారు.
- ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు విజయవాడలో ఉండి బాధితులకు అందుతున్న సేవలను పర్యవేక్షిస్తున్నారు.
- జనసేనకు చెందిన పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నిత్యావసర వస్తువులను వరద బాధితుల కోసం పంపించారు. ఆ పార్టీ నేతలు భారీగా స్వచ్ఛంద సహాయాన్ని విజయవాడకు తరలించి పంపిణీ చేస్తున్నారు.

దాతలు కూడా పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. నేరుగా జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి చెక్కుల రూపంలో విరాళాలు అందిస్తున్నారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్‌సాయిరాజ్ తల్లిదండ్రులు రంగమణి-కాశీ విశ్వనాథ్ రూ.2లక్షల చెక్కును అందించారు. ప్రముఖ జర్నలిస్టులు టీకే విశ్వనాథ్ రూ.25వేలు, ఎంఎన్‌వీ ప్రసాద్ రూ.50వేలు చెక్కులను కలెక్టర్‌కు అందజేశారు. అల్లవరం మండలం దేవగుప్తం గ్రామానికి చెందిన బొంతు నాగేంద్రప్రసాద్-లక్ష్మి కుమార్తె అక్షరతులసి పుట్టినరోజు సందర్భంగా వరద బాధితుల సహాయార్థం రూ.10వేల చెక్కును కలెక్టర్‌ను కలిసి అందజేశారు.



కలెక్టర్‌కు రూ.10వేలు అందజేస్తున్న అక్షర తులసి



జడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ వేణుగోపాల్, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

మూడు నెలలకే హడావుడా?



మాట్లాడుతున్న మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

- వారంరోజులైనా సమయం ఇవ్వరా?
- గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.95వేల కోట్ల బిల్లులు బకాయిపెడితే అప్పుడు మాట్లాడలేదే
- వైసీపీపై అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి ఆగ్రహం
- గౌరవ వేతనాల విడుదలలో జాప్యంపై జడ్పీటీసీల అసంతృప్తి
- వాకౌట్ చేస్తామనడంతో సరికాదన్న కూటమి ఎమ్మెల్యేలు
- తుపానులు, వరదలపై చర్చించాలని హితవు
- కూటమి ప్రభుత్వం వచ్చాకే స్థానిక సంస్థలకు గౌరవం
- రూ.1,452 కోట్ల ఆర్థిక సంఘం నిధులు నేరుగా జమ
- హర్షం వ్యక్తం చేసిన కూటమి ఎమ్మెల్యేలు
- కాకినాడలో వాడివేడిగా జడ్పీ సమావేశం

-6లో

ఇసుక రవాణా చేసే వాహనాలు తప్పనిసరిగా...
ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయించుకోవాలి

జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణాకు ఉపయోగించే వాహనాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ తీర్పును అమలు చేసే అంశంపై శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పనులు, వ్యక్తిగత నిర్మాణాల కోసం వాగులు, వంకల్లో ఇసుకను మనుషులతో తవ్వుకుని ఎడ్ల బండ్లపై రవాణా చేసుకోవచ్చన్నారు. నిల్వ చేసి విక్రయించకూడదని స్పష్టం చేశారు. డీసిల్టేషన్ పాయింట్ల వద్ద ట్రాక్టర్లు, లారీల్లో ఇసుకను అక్రమ రవాణా చేయకుండా పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో గుర్తించిన ఇసుక రీచ్‌లకు కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతి రాలేదన్నారు. ఇందుకు సంబంధిత అధికారులకు డెమీ అఫీషియల్ లెటర్లు పంపించాలన్నారు. జిల్లా పరిధిలోని కాటన్ బ్యారేజ్‌పై రోడ్డు మరమ్మతుకు జిల్లా మినరల్ ఫండ్ నుంచి రూ.35లక్షలు మంజూరు చేశామన్నారు. వర్క్ ఆర్డరు ఇవ్వాలని మైన్స్ అధికారులకు సూచించారు. తాతపూడి, కపిలేశ్వరపురం ఇసుక నిల్వ కేంద్రాల్లో గోదావరి వరదల కారణంగా కొంతమేర ఇసుక కోతకు గురైందని, రెవెన్యూ అధికారులు నివేదిక అందించిన నేపథ్యంలో గోదావరి హెడ్‌వర్క్స్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంబంధిత ప్రాంతాలను పరిశీలించి వారంలో నివేదిక ఇవ్వాలన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ జారీ చేసిన ఉత్తర్వులు అమలు చేసే అంశంపై చర్చించారు. జిల్లాలో అనధికారింగా నిర్వహిస్తున్న చేపలు, రొయ్యల చెరువులను గుర్తించి నివేదిక అందించాలన్నారు. లైసెన్సు లేకుండా నిర్వహిస్తున్న చెరువులను గుర్తించడానికి గ్రామ, మండల స్థాయిల్లో బృందాలు ఏర్పాటుచేసి సర్వే చేస్తామన్నారు. గ్రామస్థాయిలో ఫిషరీస్ అసిస్టెంట్, వీఆర్వో, సర్వేయర్, ఎనర్జీ అసిస్టెంట్, ఇరిగేషన్ సిబ్బందితో బృందాన్ని ఏర్పాటుచేసి అనధికారిక చేపల, రొయ్యల చెరువులను గుర్తించి 14 రోజుల్లో నివేదిక అందించాలన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో ఇసుక తవ్వుతున్నారని అందుతున్న ఫిర్యాదుల నేపథ్యంలో మైన్స్ అధికారులు ఆయా ప్రాంతాలను పరిశీలించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవోలు ఎస్.సుధాసాగర్, జికేశవర్ధనరెడ్డి, మైన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ పి.సుజాత, ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ ఈఈ విశ్వేశ్వరరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సందీప్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి అశోక్‌ప్రతాప్, మత్స్య శాఖ జేడీ ఎం.శ్రీనివాస్, ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్, జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.





దాడిలో ధ్వంసమైన ఫర్నిచర్, గాయపడ్డ వెంకటేష్ (ఇన్‌సెట్‌లో), వైద్యుడితో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు, సీఐ జేమ్స్‌రత్నప్రసాద్

రావులపాలెం ప్రగతి నర్సింగ్ హోమ్‌పై దాడి

- ఫర్నిచర్ ధ్వంసం
- వైద్యుడు సందీప్‌రెడ్డికి గాయాలు

రావులపాలెం, సెప్టెంబరు 6: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి రావులపాలెం ప్రగతి నర్సింగ్ హోమ్‌లో వైద్యం చేస్తుండగా నలుగురు యువకులు దాడి చేశారు. పోలీసులు, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం... పి.గన్నవరం మండలం గంటి పెదపూడికి చెందిన సీహెచ్ బాలాజీ, రావులపాలేనికి చెందిన బి.వెంకటేష్ మోటారు సైకిళ్లతో పరస్పరం ఢీకొన్నారు. గాయలపాలైన బాలాజీని వెంకటేష్ స్థానిక ప్రగతి నర్సింగ్‌హోమ్‌కి తీసుకెళ్లాడు. జరిగిన సంఘటనను బాలాజీ తన స్నేహితులకి ఫోనులో తెలిపాడు. బాలాజీకి డాక్టర్ సందీప్‌రెడ్డి వైద్యం చేస్తుండగా నలుగురు యువకులు మద్యం సేవించి అక్కడికి వచ్చి వెంకటేష్‌పై దాడికి పాల్పడ్డారు. క్షతగాత్రుడికి వైద్యం చేస్తుండగా ఇటువంటి దాడులు ఏమిటని వైద్యుడు సందీప్‌రెడ్డి అడ్డుకోగా వెంకటేష్‌పై విచక్షణరహితంగా దాడి చేశారు. వైద్యుడితో పాటు సిబ్బందిపై కూడా దాడి చేసి ఆసుపత్రి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. తీవ్రంగా గాయపడిన వెంకటేష్‌ను రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. సమాచారం తెలుసుకున్న రావులపాలెం ఐఎంఏ వైద్యులు ప్రగతి నర్సింగ్ హోమ్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. డాక్టర్లతో కొత్తపేట ఇన్‌చార్జి డీఎస్పీ గోవిందరావు, సీఐ జేమ్స్‌రత్నప్రసాద్ చర్చించారు. దాడికి పాల్పడ్డ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వైద్యులకు రక్షణ కల్పిస్తామన్నారు. వైద్యుడు సందీప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తామని సీఐ చెప్పారు.



ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న ఐఎంఏ వైద్యులు


ప్రత్యేక అలంకరణలో అయినవిల్లి ఆలయం

విఘ్నాలను తొలగించే సిద్ధి వినాయకుడు

● అయినవిల్లిలో వినాయక చవితి ఏర్పాట్లు పూర్తి

అయినవిల్లి, సెప్టెంబరు 6: అయినవిల్లిలో స్వయంభువై వెలిసిన వినాయకుడు సర్వ విఘ్నాలను తొలగించే స్వామిగా జగత్ ప్రసిద్ధినొందారు. ఏ శుభకార్యం తలపెట్టినా ముందుగా అయినవిల్లి సిద్ధి వినాయకుని దర్శించి పూజిస్తే ఆ కార్యం నిర్విఘ్నంగా పూర్తవుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కోనసీమలోని మధ్యగౌతమీ, వృద్ధగౌతమీ గోదావరి పాయల సమీపంలో అయినవిల్లి సిద్ధివినాయకుడి ఆలయం ఉంది. అయినవిల్లి సిద్ధివినాయక ఆలయంలో గణపతి నవరాత్రులను పురస్కరించుకుని దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ప్రాంగణంలో పూలు, పత్రాలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. చవితి రోజున ఉదయం 3.45 గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు దర్శనాలు ఉంటాయని ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. శైవాగమోక్త ప్రకారంగా అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శనివారం వినాయకచవితి సందర్భంగా స్వామివారికి వివిధ రకాల పండ్ల రసాలతో రుద్రాభిషేకం నిర్వహిస్తారు. లక్ష దూర్వార్చన, గణపతి కల్పం, శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకున్నట్టు ఆలయ ఈవో తెలిపారు.

అయినవిల్లి క్షేత్రానికి వెళ్లాలంటే..

అయినవిల్లి వినాయకుడిని దర్శించుకోవాలని భక్తులు ఎంతో ఆతృత పడుతుంటారు. రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం మీదుగా 60 కిలోమీటర్లు ప్రయాణించి అయినవిల్లి క్షేత్రం చేరుకోవచ్చు. కాకినాడ నుంచి 55కిలోమీటర్లు, పాలకొల్లు నుంచి వయా రాజోలు, అంబాజీపేట మీదుగా 61 కిలోమీటర్లు, అమలాపురం నుంచి వయా సిరిపల్లి మీదుగా 12 కిలోమీటర్లు పయనించి ఆ స్వామిని దర్శించుకోవచ్చు.



పుల్లా అబ్బులు-సత్యదేవానర్సరీలో తీర్చిదిద్దిన వృక్షగణపతి

అబ్బురపరుస్తున్న వృక్ష గణపతి

కడియం, సెప్టెంబరు 6: కడియపులంక సత్యదేవా నర్సరీలో వృక్షగణపతిని కూర్చారు.పుల్లా అబ్బులు, ఆయన కుమారులు వీరబాబు, రాజశేఖర్ పూలతో పర్యావరణ హితమైన వృక్ష గణపతి పేరిట వినాయక ఆకృతిని ఏర్పాటు చేశారు. కార్మికులతో మట్టి వినాయక బొమ్మలు తయారు చేయించి నర్సరీ రైతులకు అందజేశారు. పలువురు నర్సరీ రైతులు లయన్స్‌క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.



హౌసింగ్‌బోర్డు కాలనీ, పుష్కరవనంలో
చిరుత సంచరించిందని పుకార్లు

● అప్రమత్తమైన అటవీ సిబ్బంది
● అటవీ అధికారులు, ఉద్యోగుల విస్తృత గాలింపు
● ఆర్ఎఫ్ఆర్‌సీలో అమర్చిన ట్రాప్ కెమెరాలు


ఆర్ఎఫ్ఆర్‌సీలో అమర్చుతున్న ట్రాప్ కెమెరాలు, అనుమానాస్పదంగా ఉన్న పులి అడుగుజాడలు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 6: చిరుతపులి సంచరిస్తోందన్న వార్తలు నేపథ్యంలో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీ, పుష్కరవనం మధ్య గురువారం అర్ధరాత్రి సమయంలో చిరుతపులి సంచరించిందన్న వార్తలు కలకలం రేపాయి. దీంతో అటవీ సిబ్బంది, స్థానిక రాష్ట్ర అటవీ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఉద్యోగులు శుక్రవారం ఉదయం నుంచి గోదావరి మహాపుష్కరవనం, దాని సమీపంలోని అటవీ పరిశోధనా సంస్థ(ఆర్ఎఫ్ఆర్‌సీ) పరిసరాల్లో విస్తృతంగా గాలించారు. కొన్ని అనుమానాస్పద అడుగుజాడలు కనిపించాయని, అయితే ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా నేల బురదగా ఉండడంతో తమకు లభించిన అడుగు జాడలను వారు నిర్ధారించలేకపోయారు. కాగా అనుమానాస్పద అడుగుజాడలను ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పెగ్ మార్క్ చేసినట్టు దివాన్‌చెరువు సెక్షన్ డీఆర్వో పద్మావతి తెలిపారు. ఎనిమిది ట్రాప్ కెమెరాలను రప్పించామని, ఆర్ఎఫ్ఆర్‌సీ వద్ద అనుమానాస్పద పాదముద్ర లభించిన పరిసరాలలో వాటిని అమర్చుతున్నామన్నారు. దివాన్‌చెరువు, శ్రీరాంపురం, రూపానగర్, హౌసింగ్‌బోర్డుకాలనీ, ఆటోనగర్‌గ్రామాల ప్రజలు చిరుతపులి సంచరిస్తుందన్న ప్రచారంతో భయాందోళనలు చెందుతున్నారు.

ద్వారపూడి వెళుతున్న హర్షకుమార్‌ను అడ్డుకున్న పోలీసులు

● జాతీయ రహదారిపై నిరసన.. నిలిచిన వాహనాలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 6: ద్వారపూడిలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన సంఘటనపై బాధితులతో మాట్లాడేందుకు వెళుతున్న మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ కారును రాజమహేంద్రవరం బెస్ట్‌ప్రైజ్ సెంటర్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరును వ్యతిరేకిస్తూ ఆయన అక్కడే జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం నిర్బంధం లేకపోవడంతో ఆయన ద్వారపూడి నుంచి వచ్చిన కొంతమంది యువత కలిశారు. వారితో మాట్లాడిన సదరు యువతతో కలిసి కారులో ద్వారపూడి బయలుదేరారు. ఈ క్రమంలో పోలీసులు అడ్డగించడంతో హర్షకుమార్ జాతీయరహదారిపై ధర్నా చేశారు. దీంతో సుమారు 2కిలోమీటర్ల వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు నేరుగా ఆయనను ఇంటికి తీసుకువెళ్లి మళ్లీ గృహనిర్బంధం చేశారు. హైవే సైడ్ అప్రోచ్ రోడ్డుగుండా వాహనాలను మళ్లించారు.


జాతీయ రహదారిపై హర్షకుమార్ కారును నిలుపుదల చేసిన పోలీసులు

చవితి ఉత్సవాలకు
లక్ష్మీగణపతి ఆలయం ముస్తాబు

బిక్కవోలు, సెప్టెంబరు 6: బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతి ఆలయంలో శనివారం నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి, ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు. స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం లైన్లు ఏర్పాటు చేశామన్నారు. శనివారం తెల్లవారుజాము నుంచే భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తామన్నారు. ఆలయ ప్రాంగణమంతా పందిరి డెకరేషన్, విద్యుత్ దీపాలంకరణ చేశామన్నారు.

భారీ పోలీసు బందోబస్తు

లక్ష్మీగణపతి ఆలయంలో శనివారం నిర్వహించే చవితి ఉత్సవాలకు సీఐ శివగణేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్టు ఎస్ఐ రవిచంద్రకుమార్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన లైన్లను శుక్రవారం సీఐ పరిశీలించారు. ఇద్దరు ఎస్ఐలతో పాటు 25 మంది పోలీసులను బందోబస్తుకు నియమించినట్టు చెప్పారు. వీరి వెంట టీడీపీ నాయకులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి రాజారెడ్డి, కొమ్మోజు శ్రీనివాస్, వెంకటరామయ్య తదితరులున్నారు.


బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో ఏర్పాటుచేసిన పందిరి డెకరేషన్

వరద బాధితులకు ఎమ్మెల్యే బత్తుల రూ.25 లక్షల విరాళం


నగదు చెక్కును చూపిస్తున్న బత్తుల దంపతులు

రాజానగరం, సెప్టెంబరు 6: విజయవాడ పరిసర ప్రాంత వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ శుక్రవారం రూ.25లక్షలు విరాళంగా ప్రకటించారు. వరద బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తాను అందించిన అనేక సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. తన భార్య వెంకటలక్ష్మి, కుమార్తెలు, అల్లుడు నిర్ణయం మేరకు నియోజకవర్గం తరఫున రూ.25 లక్షలు విరాళంగా అందజేశామన్నారు. వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలనే సంకల్పంతో సీఎం సహాయ నిధికి అందించామన్నారు. వరద బాధితులకు ఆదుకోవడంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎనలేని సేవలందించారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాజానగరం నియోజకవర్గంలోని దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వరద బాధితుల సహాయార్థం తమ విరాళాలను చెక్కు రూపంలోగానీ, డీడీ రూపంలో గానీ సీఎం సహాయనిధికి విరివిరిగా విరాళాలు అందజేయాలని కోరారు.

ఇద్దరు యువకులు ఆత్మహత్య


ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న యువకులు

తాళ్లరేవు, సెప్టెంబరు 6: కాకినాడజిల్లా తాళ్లరేవు మండలం జి.వేమవరం పంచాయతీ పరిధి అడివిపోలంలో ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకున్నట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అడివిపోలం కోళ్ల పెంపక కేంద్రంలో పెదపూడి మండలం ఏపీత్రయంకు చెందిన పెసింగి విస్సాకు(21), గుర్రాని భవాని కిషోర్(22) ఇద్దరు స్నేహితులు. గురువారం రాత్రి జి.వేమవరం అడవిపోలం కోళ్లఫారంలోకి పనిచేసేందుకు వచ్చారు. అప్పులపాలై మద్యంమత్తులో వారు జీవితంమీద విరక్తిచెంది ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. మృతదేహాలను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు తరలించి అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు విస్సాకు సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని వెళ్లి పరిశీలించినట్టు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచి దూకి యువకుడి ఆత్మహత్య

అనపర్తి, సెప్టెంబరు 6: అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన లంక నరేంద్ర(18) అనపర్తి రైల్వే ఓవర్ బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. నరేంద్ర అనపర్తిలోని తాతయ్య ఇంటివద్ద ఉంటూ స్థానికంగా దుకాణంలో పనిచేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున కడుపునొప్పి వస్తుందని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. స్థానిక రైల్వే ఓవర్ బ్రిడ్జి పైనుంచి ట్రాక్‌పైకి దూకడంతో తల వెనుక బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే సూపరింటెండెంట్ సమాచారం మేరకు సామర్లకోట రైల్వే ఎస్ఐ బి.లోవరాజు సంఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లోవరాజు తెలిపారు.

మూడు నెలలకే హడావుడా?

● వారంరోజులైనా సమయం ఇవ్వరా..?
● గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.95వేలకోట్ల బిల్లులు బకాయిపెడితే అప్పుడు మాట్లాడలేదే
● వైసీపీపై అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి ఆగ్రహం
● గౌరవ వేతనాల జాప్యంపై జడ్పీటీసీల అసంతృప్తి
● వాకౌట్ చేస్తామనడంతో సరికాదన్న కూటమి ఎమ్మెల్యేలు
● తుపానులు, వరదలపై చర్చించాల్సిన అవసరం ఉందని హితవు
● చర్చించిన అంశాల అమలుకు చర్యలు: జడ్పీ చైర్మన్
● కాకినాడలో వాడివేడిగా జడ్పీ సమావేశం
● కూటమి ప్రభుత్వం వచ్చాకే స్థానిక సంస్థలకు గౌరవం
● రూ.1452కోట్ల ఆర్థిక సంఘం నిధులు నేరుగా జమ
● హర్షం వ్యక్తం చేసిన కూటమి ఎమ్మెల్యేలు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 6: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడిగావేడిగా సాగింది. ఏటా పంటలకు ఎదురవుతున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారంగా సాగునీటి వ్యవస్థలపై ఆక్రమణలు తొలగించి ఆధునికీకరించే సమగ్ర కార్యాచరణ రూపకల్పనకు సమావేశం నిర్ణయించింది. జిల్లాలో రహదారులు అధ్వానంగా మారాయని, కనీసం రోడ్ల గోతులు పూడ్చే పనులలైనా తక్షణం చేపట్టాలని సభ్యులు నిలదీశారు. కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో శుక్రవారం జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం, స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షత వహించారు.

జడ్పీటీసీల వేతనాలపై మాటామాటా..

జడ్పీ వైస్‌చైర్మన్ బుర్రా అనుబాబు నేతృత్వంలో జడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ 21నెలలుగా తమకు గౌరవ వేతనం చెల్లించలేదని, జనరల్ ఫండ్స్ నుంచి గౌరవ వేతనం చెల్లించేలా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ జడ్పీటీసీలకు గౌరవ వేతనాలు ఇవ్వకుండా బాధపెట్టడం సరికాదని, తక్షణమే 50శాతం వేతనం అయినా చెల్లించాలని సూచించారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ సభ్యుల వేతనాలు 50శాతంకాదని, పూర్తిగా చెల్లించాలని పట్టుబట్టారు. తాము వాకౌట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని జడ్పీటీసీలు చెప్పగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ స్పందిస్తూ ఈ విషయమై వారంరోజుల్లో నిర్ణయం తీసుకుంటామని, వేతనాల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతానని తెలిపారు. అయినా జడ్పీటీసీలు అసంతృప్తి వ్యక్తం చేయడంతో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కలుగజేసుకుని ప్రభుత్వం ఏర్పడి మూడునెలలే అయ్యిందని, ముఖ్యమైన సమస్యలు చర్చించాల్సి ఉండగా వాకౌట్ చేస్తామనడం సరికాదని హితవు పలికారు. రానున్న రోజుల్లో అందరం కలిసి పనిచేద్దామన్నారు. స్థానిక సంస్థల సభ్యులకు తగిన గుర్తింపు గౌరవం లభించే రోజులు కానున్నాయన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ కోనసీమలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

అప్పుడు మాట్లాడలేదే: అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.95వేలకోట్ల బిల్లులు బకాయి పెడితే నోరు విప్పని ప్రజాప్రతినిధులు ఈ మూడు నెలలకే హడావుడి చేయడం సరికాదన్నారు. దీనివల్ల కొందరు కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. 14, 15 ఆర్థిక సంఘ నిధులను స్థానిక సంస్థలకు జగన్ ప్రభుత్వం జమచేయలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.1452కోట్లు నేరుగా స్థానిక సంస్థలకు జమచేసి వాటి గౌరవాన్ని కాపాడిందన్నారు. 21నెలలుగా చెల్లించని గౌరవవేతనం సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వానికి వారంరోజులు సమయం ఇవ్వకుండా జడ్పీటీసీలు వాకౌట్ చేస్తామనడం సమంజసం కాదన్నారు. తుపానులు, వరదలతో ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వాటి గురించి చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.20కోట్లతో గోదావరి డెల్టా ఆధునికీకరణ పనులు ప్రారంభించిందన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల 34 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు కలెక్టర్లతో సమావేశం ఏర్పాటుచేసి డెల్టా ఆధునికీకరణకు నివేదికలు రూపొందించాలన్నారు.

కాలువలపై ఆక్రమణలు తొలగించాలి: కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ

కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ ఇరిగేషన్ కాలువలపై ఆక్రమణలు తొలగించి వాటిని ఆధునికీకరించాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. రమణయ్యపేట నుంచి గొడారిగుంట మీదుగా ఉప్పుటేరులో ముంపు నీరు కలిసే పళ్లంరాజు కెనాల్ మీద ఆక్రమణలు తొలగించాలన్నారు. రమణయ్యపేట పరిసర గ్రామాల్లో ఫ్యాక్టరీల కాలుష్యం, రసాయన వ్యర్థాలతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని, అక్కడ కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిని కట్టించి అందుబాటులోకి తేవాలన్నారు.


సమావేశంలో పాల్గొన్న జడ్పీటీసీలు

రోడ్ల పరిస్థితి దారుణం: జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ జిల్లాలో రోడ్ల పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. పూర్తి స్థాయిలో కాకపోయినా తక్షణం గోతులను అయినా పూడ్చించాలన్నారు. వాహనాలపై ప్రయాణించేవారు గోతుల్లో పడి ప్రమాదాలకు గురై మరణిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.1450 కోట్ల నిధులు నేరుగా గ్రామ పంచాయతీలకు విడుదల చేసి స్థానిక సంస్థల సభ్యుల గౌరవం పెంచిందన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి: జడ్పీ చైర్మన్

జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు సంబంధించి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, విస్తృతంగా చర్చించిన అంశాల అమలుకు చర్యలు తీసకుంటామని తెలిపారు. జిల్లాకు సంబంధించిన పలు సమస్యలపై చర్చించారు. జడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ సభ్యుల గౌరవ వేతన విషయం ఇప్పటికే ప్రభుత్వం దృష్టిలో ఉందన్నారు. సమావేశంలో తూర్పుగోదావరి జేసీ ఎస్.చినరాముడు, వివిధ మండలాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఉమ్మడి జిల్లా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైళ్ల రద్దు

● జరుగుతున్న రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు

సామర్లకోట, సెప్టెంబరు 6: విజయవాడ ఎగువ ప్రాంతా లలో రైల్వేట్రాక్ భారీ వరదల కారణంగా దెబ్బతినడంతో సామర్లకోట మీదుగా అటు విశాఖ, ఇటు విజయవాడలకు పలు రైళ్ల రాకపోకలను రద్దుచేసిన కొన్ని రైళ్లను తిరిగి పునరుద్ధరించారు. ఇంకా మరి కొన్ని రైళ్లను రద్దు జాబితాలో ఇంకా కొన సాగిస్తూ రైల్వే ఉన్నతాధికారులు రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. నెం. 12737 గల కాకినాడ-లింగంపల్లి మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ ముందుగా నిర్దేశించన సమయం శుక్రవారంరాత్రి 7.10కు కాకుండా అర్ధరాత్రి 12.30కు రీషెడ్యూల్ చేసి కాకినాడ నుంచి బయలుదేరుతుందని సామర్లకోట స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ శుక్రవారంరాత్రి చెప్పారు. ఈమేరకు డిప్యూటీ సీవోఎం కె.మణికుమార్ (సికింద్రాబాద్) నుంచి ఉత్తర్వులు అందాయి. ఈనెల 7,8,9 తేదీల వరకూ రద్దు చేసిన రైళ్ల వివరాలను ఈవిధంగా ఉన్నాయి. విజయవాడ-రాజమండ్రి మధ్య నడిచే(07459) రైలు, భీమవరం-నిడదవోలు మధ్య నడిచే (07885) రైలు, రాజమండ్రి- విజయవాడ మధ్య నడిచే (07460) రైలు, భీమవరం-నిడద వోలు మధ్య నడిచే (07885) రైలు, నిడదవోలు-భీమవరం మధ్య నడిచే (07886) రైలు, నరసాపురం-నిడదవోలు- నరసాపురం మధ్య నడిచే రైలు (07673,07674), భీమవరం-నిడదవో లు-భీమవరం మధ్య నడిచే రైళ్ల (07772, 07882), విజయ వాడ-రాజమండ్రి- విజయవాడ మధ్య నడిచే రైళ్ల (07768, 07767) ఈనెల 7,8 తేదీలలో రద్దు చేశారు. కాకినాడ-విజయ వాడ మధ్య నడిచే రైలు (17258) ఈనెల 7,8,9 తేదీలలో రద్దు చేశారు. గురువారం విశాఖ- గుంటూరుల మధ్య సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈనెల 9వరకూ రద్దయ్యాయి. కాకినాడ-లింగం పల్లి- కాకినాడ మధ్య నడిచే (12737, 12738, 12775) రైలు, నాందేడ్-విశాఖ మధ్య నడిచే (20812) రైలు, విశాఖ-మహ బూబ్‌నగర్-విశాఖ మధ్య నడిచే (12861, 12862) రైళ్లు ఈనెల 5 నుంచి విజయవాడ సమీపాన రాయనపాడు స్టేషన్లో హాల్ట్ పాక్షికంగా ఎత్తివేశారు. ఈమేరకు రైల్వే ఎస్టీఎం చార్జ్ అధికారి రాజనరసు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు జారీ చేసిన ఉత్తర్వులలో పేర్కొన్నారు.

పూలు కోయడానికి మడుగులోకి దిగి వ్యక్తి మృతి

కరప, సెప్టెంబరు 6: కలువ పూలు కోయడానికని మడుగులోకి దిగిన ఒక వ్యక్తి ప్రమాదవశాత్తూ అందులో మునిగి చనిపోయినట్టుగా కరప పోలీసులు తెలిపారు. కాకినాడజిల్లా కరప మండలం కూరాడ శివారు చినమామిడాడ గ్రామానికి చెందిన బత్తుల శివ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వినాయక చవితి పర్వదినానికి కలువ పూలు విక్రయిద్దామని భావించిన శివ బుధవారం స్థానికంగా ఉన్న ఒక మడుగులోకి దిగాడు. పూలు కోస్తుండగా శివకు ఫిట్స్ వచ్చి మడుగులో బోర్లా పడ్డాడు. ఆ సమయంలో ఎవరూ గమనించకపోవడంతో మడుగులో మునిగి చనిపోయాడు. శుక్రవారం ఉదయం మడుగుపై తేలిన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వీఆర్వో దేవగుప్తాపు ప్రసన్న ద్వారా కరప పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహానికి పోస్టుమార్టమ్ నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కరప ఇన్‌చార్జ్ ఎస్ఐ మూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి

● మృతులు పల్నాడు జిల్లా సీవల్లిపురం, శ్రీకాకుళం జిల్లా పలాసవాసులు ● శోకసంద్రంలో తోటి విద్యార్థులు


రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రివద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థుల భౌతికకాయాల వద్ద విలపిస్తున్న బంధువులు, విద్యార్థులు

రోణంకి ప్రవీణ్ కుమార్ (ఫైల్) | చింతా కార్తీక్ (ఫైల్)

దివాన్‌చెరువు, సెప్టెంబరు 6: తూర్పుగోదావరిజిల్లా జాతీయ రహదారిపై దివాన్‌చెరువు వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో పల్నాడు జిల్లా సీవల్లిపురం గ్రామానికి చెందిన చింతా కార్తీక్(19), శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన రోణంకి ప్రవీణ్(21) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వీరిద్దరూ ఇక్కడ సమీపంలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి బొమ్మూరు ఎస్ఐ అంకారావు శుక్రవారం విలేకరులకు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. వీరు బ్రిడ్జి కౌంటీలోని ఒక రూమ్‌లో ఉంటున్నారు. ప్రవీణ్‌కు ఒంట్లో బాగోకపోవడంతో ఇద్దరు గురువారంరాత్రి స్కూటీపై ఆసుపత్రికి బయలుదేరారు. మార్గమధ్యంలో దివాన్‌చెరువు పెట్రోలు బంకు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా వీరిని ఢీకొని కొద్దిదూరం ఈడ్చుకుంటూ వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఇద్దరి శరీరభాగాలు తెగి రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో ఆప్రాంతమంతా రక్తసిక్తమైంది. సమాచారం అందుకున్న వెంటనే బొమ్మూరు సీఐ కాశీవిశ్వనాథ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకోగా డ్రైవరు పరారీలో ఉన్నాడన్నారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అంకారావు తెలిపారు.

సహచర విద్యార్థుల దిగ్భ్రాంతి

శవపరీక్ష అనంతరం విద్యార్థుల భౌతికకాయాలు తీసుకువెళ్తున్న అంబులెన్స్‌లను వారు చదువుతున్న కళాశాల ప్రధానద్వారం వద్దకు తీసుకు వచ్చి కొద్దిసేపు ఉంచారు. నిన్నటి వరకూ తమతో కలసి ఉన్న విద్యార్థులు రోడ్డు ప్రమాదానికి గురై తిరిగిరాని లోకాలకు చేరుకోవడంతో సహచర విద్యార్థులు జీర్ణించుకోలేకపోయారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, తోటి విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి సంతాపం తెలిపారు.


ర్యాలీగా వెళుతున్న విద్యార్థులు


బోరున విలపిస్తున్న కార్తీక్ తండ్రి వీరాంజనేయులు

ఒక్క కొడుకూ దూరమయ్యాడు...

● మృతుడు కార్తీక్ తండ్రి వీరాంజనేయులు కన్నీటి పర్యంతం

రాజమహేంద్రవరంఅర్బన్, సెప్టెంబరు 6: ఎన్నో ఆశలతో ఇంజనీరింగ్ చదివిస్తున్న తన ఒక్కగానొక్క కొడుకు దూరమయ్యాడని దివాన్‌చెరువు వద్ద లారీ ఢీ కొన్న దుర్ఘటనలో మృతి చెందిన చింత కార్తీక్ తండ్రి వీరాంజనేయులు రోధించడం అక్కడున్న వారిని కలచివేసింది. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన ఇంజనీరింగ్ విద్యార్థులు చింత కార్తీక్, రోణంకి ప్రవీణ్ మృతదేహాలకు శుక్రవారం రాజమహేంద్రవరంలోని జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం వారి బంధువులకు అప్పగించారు. కాగా, వీరాంజనేయులు వ్యవసాయం చేస్తుంటారు. ప్రమాదం వార్త తెలియగానే పలాస నుంచి ప్రవీణ్ కుటుంబ సభ్యులు, వినుకొండ నుంచి కార్తీక్ కుటుంబ సభ్యులు హుటాహుటిన రాజమహేంద్రవరం చేరుకున్నారు. కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆసుపత్రి మార్చురీ వద్దకు గైట్ కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొందరు విద్యార్థులు కన్నీళ్లు పెట్టుకున్నారు.

డైనింగ్ హాలు నిర్మాణానికి శంకుస్థాపన

అమలాపురం రూరల్, సెప్టెంబరు 6: బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం మోనోలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ (ఏలూరు) సొంత ఖర్చుతో డైనింగ్ హాలు నిర్మాణానికి ముందుకొచ్చింది. ఎస్ఎంసీ చైర్మన్ బట్టు పండు, వైస్‌చైర్‌పర్సన్ కూర్మా వీరవేణి ఆధ్వర్యంలో శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, సర్పంచ్ పెనుమాల సునీత, స్థల దాతలు, గ్రామ పెద్దలు బాసిన శివన్నారాయణ, సమయమంతుల పండు, పేరి శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



పి.గన్నవరం: విజయవాడ వెళ్తున్న వాహన శ్రేణికి జెండా ఊపుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, సెప్టెంబరు 6: ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో నిత్యావసరాలను పంపిణీ చేసేందుకు వెళ్తున్న వాహనశ్రేణిని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, చీకురమిల్లి వెంకటేశ్వరరావు, సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, యర్రంశెట్టి సాయిబాబు, పల్లి మోషే, గణపతి రాముడు, బొంతు పెదబాబు, చొల్లంగి సత్తిబాబు, మోల్లేటి శ్రీను, సూధా బాబ్జి, పప్పల సత్తిబాబు, శేరు శ్రీనుబాబు, తాటికాయల శ్రీనివాసరావు, కె.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

అంతర్వేది: విజయవాడ వరద బాధితులకు అంతర్వేది పల్లిపాలేనికి చెందిన పొన్నాల విజయవెంకటనరసింహరాజు 300 ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొన్నాల ప్రభ, కొపనాటి స్వామి, బొమ్మిడి రమేష్ పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: విజయవాడ వరద బాధితుల కోసం సమనస శ్రీరామా పబ్లిక్ స్కూలు విద్యార్థులు రూ.35వేలతో వాటర్ బాటిళ్లు, బిస్కట్ ప్యాకెట్లు, రస్కు ప్యాకెట్లు కొనుగోలు చేసి ప్రత్యేక వాహనాల్లో శుక్రవారం విజయవాడ తరలించారు. శనివారం వాటిని బాధితులకు స్వయంగా అందజేస్తామని ప్రిన్సిపాల్ పురాణపండ లక్ష్మీగణేష్, వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి తెలిపారు. 3వేల మంది బాధితులకు అందించేందుకు చీరలు, దుప్పట్లు సమకూర్చినట్టు తెలిపారు. స్థానిక దుర్గమ్మ గుడి కమిటీ అందించిన వంద కొత్త చీరలను బాధితులకు అందిస్తామని చెప్పారు.

రావులపాలెం: యూటీఎఫ్ నాయకుడు జ్యోతిబసు ఆధ్వర్యంలో మండలశాఖ సభ్యులు విజయవాడ శాంతినగర్ ప్రాంతంలో పర్యటించి బాధితులకు సాయాన్ని అందించారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్రకార్యదర్శులు మనోహర్ కుమార్, జ్యోతిబసు, జి.సోమశేఖరరావు, లింగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అంబాజీపేట: అంబాజీపేటకు చెందిన ఫ్రెండ్స్ ఫరెవర్ హెల్పింగ్ సంస్థ సభ్యులు గురువారం రాత్రి విజయవాడ సింగ్నగర్, వాంబే కాలనీ తదితర కాలనీల్లో వరద బాధితులకు 10వేల వాటర్ ప్యాకెట్లు, బిస్కెట్లు, పాలు, కొవ్వొత్తులు, రొట్టెలు అందించారు. సభ్యులను పలువురు అభినందించారు.

మామిడికుదురు: విజయవాడ రాజీవ్‌నగర్ వడా కాలనీలో వరద బాధితులకు శుక్రవారం పెదపట్నంలంక గ్రామానికి చెందిన షెకీనాఫెయిత్ హోం నిర్వాహకులు ఇంటి రాజేష్‌బాబు తన సేవకులతో కలిసి నిత్యావసరాలను పంపిణీ చేశారు. అడబాల చక్ర, కోటి, ఇంటి దివ్య, కాకిలేటి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలమూరు: చింతలూరు నుంచి కూటమి నాయకుల ఆధ్వర్యంలో రూ.లక్ష విలువైన నిత్యావసరాలను ప్యాక్ చేయించి వ్యానులో విజయవాడ తరలించారు. మడికి నుంచి జనసేన అధ్వర్యంలో కూరగాయలను, పెదవళ్ల నుంచి జనసేన అధ్వర్యంలో నిత్యావసరాలను విజయవాడ పంపించారు.

గురువును మించిన దైవం లేదు

పి.గన్నవరం, సెప్టెంబరు 6: గురువును మించిన దైవం మరొకటి లేదని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారా యణ అభిప్రాయపడ్డారు. స్థానిక సాయితేజ విద్యా సంస్థలు వద్ద జరిగిన గురుపూజోత్సవంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. ఎమ్మెల్యేను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు సన్మానించారు. అలాగే లంకలగన్నవరంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కొల్లు రవీంద్రకు కళాశాల యాజమాన్యం సమకూర్చిన రూ.10వేలను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో టీడీపీ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, కళాశాల కరస్పాండెంట్ ఏవీఆర్ హనుమాన్, రాణీ, హెచ్ఎం ఎస్.వి.కృష్ణ, ప్రిన్సిపాల్ కొండబాబు, నాయకులు సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరావు, తోలేటి సత్తిబాబు, చొల్లంగి సత్తిబాబు, యర్రంశెట్టి సాయిబాబు పాల్గొన్నారు.

మార్కెట్‌కు చవితి శోభ



ముమ్మిడివరం: పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 6: గణపతి నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వినాయకుని ఆలయాల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటుచేసి వాటిని అలంకరించారు. శనివారం నెలకొలిపే వినాయకుని ఉత్సవ విగ్రహాన్ని ఇప్పటికే సిద్ధం చేశారు. ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతంలో లక్ష్మీగణపతి, బళ్లగేటు సెంటర్‌లో త్రిముఖ గణపతి, పోలీసుస్టేషన్ సెంటర్‌లో లక్ష్మీగణపతితో పాటు పలు ప్రధాన కూడళ్లలో గణపతి నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తిచేశారు. రాయుడువారిపాలెం, అనాతవరం, క్రాపచింతలపూడి, అయినాపురం, కొత్తలంక, గేదెల్లంక, అన్నంపల్లి, సీహెచ్ గున్నేపల్లి తదితర గ్రామాల్లో వినాయకుని ఆలయాల వద్ద మండపాలు ఏర్పాటు చేశారు.

పూజా సామగ్రితో కళకళ: చవితి ఉత్సవాలకు సంబంధించిన పూజా సామగ్రి విక్రయ స్టాల్స్‌లో ముమ్మిడివరం పట్టణం కళకళ్లాడింది. మార్కెట్ ప్రాంతం, బళ్లగేటు సెంటర్, కొండాలమ్మచింత తదితర ప్రాంతాల్లో పండ్లు, పత్రి, పువ్వులు, పూజా సామగ్రి విక్రయశాలలను పెద్దఎత్తున ఏర్పాటుచేశారు. పూజా సామాగ్రిని కొనుగోలు చేసేందుకు తరలివచ్చిన ప్రజలతో శుక్రవారం రోడ్లన్నీ కళకళ్లాడాయి

ఘనంగా చవితి ఏర్పాట్లు

అంతర్వేది, సెప్టెంబరు 6: సఖినేటిపల్లి మండలంలో గణపతి నవరాత్రుల్లో భాగంగా వినాయక విగ్రహాలు ఏర్పాటుచేసే మండపాలు శుక్రవారం రాత్రికి సిద్ధమయ్యాయి. మండపాలను విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించారు. అంతర్వేది, అంతర్వేదిదేవస్థానం, కేశవదాసుపాలెం, మోరి, మోరిపోడు, వీవీమెరక, సఖినేటిపల్లి, సఖినేటిపల్లి లంక, రామేశ్వరం, గొంది గ్రామాల్లో ఉత్సవాల ఏర్పాట్లు శరవేగంగా సాగాయి. శనివారం ఉదయం 10గంటలకు సఖినేటిపల్లి రామాలయం, 11గంటలకు సఖినేటిపల్లి శివాలయం, 11.30గంటలకు సఖినేటిపల్లిలంకలో నిర్వహించే గణపతి నవరాత్రుల్లో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొంటారని జనసేన నాయకులు తెలిపారు.

వినాయక చవితికి పందిళ్లు సిద్ధం

అల్లవరం, సెప్టెంబరు 6: అల్లవరం, మొగళ్లమూరి, బోడసకుర్రు, బెండమూర్లంక, గోడితిప్ప, కొమరగిరిపట్నం, దేవగుప్తం, డి.రావులపాలెం గ్రామాల్లో భారీ గణనాథులను ఏర్పాటు చేసి పందిళ్లను అలంకరించారు. వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తహశీల్దారు వీవీఎల్ నరసింహం, ఎంపీడీవో కృష్ణమోహన్ సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా పోలీసులకుసూచనలు చేశారు.

వినాయక చవితి మండపాల ఏర్పాట్లు పూర్తి

రావులపాలెం, సెప్టెంబరు 6: మండలంలోని పలు గ్రామాల్లో ముఖ్య కూడళ్ల వద్ద కమిటీల ఆధ్వర్యంలో చలువ పందిళ్లు వేసి వినాయక చవితి మండపాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలంకరణలు, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించారు.

మార్కెట్ కిటకిట

మండపేట, సెప్టెంబరు6: మార్కెట్‌కు చవితి కళ వచ్చింది. వివిధ గ్రామాల నుంచి మండపేటకు ప్రజలు తరలిరావటంతో మార్కెట్ కిటకిటలాడింది. మండపేట మెయిన్ రోడ్డు, కేపీరోడ్డు వినాయక చవితి పత్రి, వినాయప్రతిమలు విక్రయాలు నడుమ జనంతో కిక్కిరిసిపోయింది. పత్రి, పూలు, పండ్లు, బొమ్మల ధరలు ఆకాశాన్నంటాయి. మార్కెట్‌లో వినాయక చవితి సందడి నేపథ్యంలో వస్త్ర దుకాణాలు, వ్యాపారసంస్థలు ప్రజలతో సందడిగా కనిపించాయి.

ముస్లింల ఆధ్వర్యంలో ప్రతిమల పంపిణీ

అమలాపురంటౌన్, సెప్టెంబరు6: జానీబాషా సేవా సమితి అధినేత షేక్ కరీముల్లాబాబా, జనసేన నాయకుల ఆధ్వర్యంలో హిందువులకు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. నాయకులు లింగోలుపండు, ఎండీ బషీర్, తిక్కా సరస్వతి, మొహమ్మద్ మహబూబ్ షరీఫ్, మున్వర్, షఫీ, బాషా, దూలం బుజ్జి పాల్గొన్నారు.

సిద్ధార్థ స్కూలులో చవితి ఉత్సవాలు

ఆలమూరు, సెప్టెంబరు6: స్థానిక శ్రీసిద్ధార్థ హైస్కూల్లో వినాయక చవితి వేడుకలను డైరెక్టర్ కె.ముల్లారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వినాయక చవితి ప్రాముఖ్యతను ఆయన విద్యార్థులకు వివరించారు. వినాయకుడు, శివుడు, పార్వతి వేషధారణల్లో విద్యార్థులు ఆకట్టుకున్నారు. టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 6: మండలంలోని గ్రామాల్లో చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామాల్లోని గణపతి ఆలయాల వద్ద, ప్రధాన కూడళ్ల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటుచేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. గణపతి నవరాత్రులను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ, ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు.

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ

కాట్రేనికోన,సెప్టెంబరు6: ఫ్రెండ్లీక్లబ్ ఆధ్వర్యంలో కాట్రేనికోనలో 300మట్టి గణపతి ప్రతిమలను పంపిణీచేశారు. అధ్యక్షుడు గ్రంధి నానాజీ, వ్యవస్థాపకుడు ఆకొండి నాగరవీంద్రజోగయ్యశాస్త్రి, గౌరవఅధ్యక్షుడు తాతపూడి లక్ష్మీనారాయణమూర్తి, ఆకొండి ఉమామహేశ్వరశర్మ, ఆణివిళ్ళ ఫణికాంత్‌శర్మ, విత్తనాల వెంకటరమణ పాల్గొన్నారు.

ద్వారపూడి నాలుగు రోడ్ల జంక్షన్‌లో పంచాయతీ తీర్మానంతో ఫ్లడ్ లైట్ల ఏర్పాటు



మండపేట, సెప్టెంబరు 6: ద్వారపూడిలో రెండు సామాజిక వర్గాల మధ్య డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వంగవీటి మోహనరంగా విగ్రహాల ఏర్పాటుపై ఏర్పడిన స్థల వివాదం ఎట్టకేలకు శుక్రవారం రాత్రి పరిష్కారమైంది. ఐదు రోజుల నుంచి గ్రామంలో పోలీసు సెక్షన్30 అమల్లో ఉంది.వంతెన వద్ద నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద విగ్రహాలు ఏర్పాటు చేయకుండా శుక్రవారం పంచాయతీ అత్యవసర సమావేశం నిర్వహించి నాలుగురోడ్ల కూడలిలో నాలుగు ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. పంచాయతీ తీర్మానంతో పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశారు. విగ్రహం ప్రదేశానికి అమలాపురం మాజీ ఎంపీ జీ.వి.హర్షకుమార్ వచ్చేందుకు చేసిన ప్రయత్నాలను రాజమహేంద్రవరం పోలీసులు అడ్డుకున్నారు. రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్, డీఎస్పీ రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ పీతల దొరరాజు పర్యవేక్షణలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ ఐదం రాజు, సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉపసర్పంచ్ తులా శేషారావు లైట్లు ఏర్పాటు చేశారు. ప్రజల అవసరాల కోసం నాలుగురోడ్ల జంక్షన్ వద్ద విద్యుత్ లైట్లను ఏర్పాటు చేసిందని సర్పంచ్ ఈతకోట కిన్నెర తెలిపారు. సున్నితమైన సమస్య పరిష్కారా నికి ఇరువర్గాల పెద్దలు సహకరించాలని ఆమె కోరారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయరాలికి సత్కారం

అంబాజీపేట, సెప్టెంబరు6: జిల్లాఉత్తమ ఉపాధ్యాయురాలిగా కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్న గంగలకుర్రు అగ్రహారం ముషిణివారిపాలెం ఉపాధ్యాయురాలు కొండ భ్రమరాంబదేవిని ఎస్టీయూ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఎస్టీయూ రాష్ట్ర సంక్షేమ నిధి కన్వీనర్ బోనం గంగాధర్, అధ్యక్ష, కార్యదర్శులు కుంపట్ల సుబ్బారావు, ఎండీఎస్ఎం షరీఫ్, బి.శివ, మూర్తి అభినందించారు.

లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతున్న వరద నీరు



ఆలమూరు: జొన్నాడ వద్ద రెండు బ్రిడ్జిల మధ్య ప్రవహిస్తున్న వరద నీరు

ముమ్మిడివరం, సెప్టెంబరు6: గోదావరి ఎగువన వరద నీటి ఉధృతి పెరగడంతో లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు ప్రవేశించింది. శుక్రవారం నాటికి మరో రెండు అడుగుల నీటి మట్టం పెరిగింది. లంక గ్రామాల్లోని ఇంటర్నల్ రోడ్లు నీట మునిగాయి. వివేకానంద వారధి నుంచి గురజాపులంక వెళ్లే సిమెంటు రోడ్డుపై కూనాలంక నుంచి వరదనీరు ప్రవహిస్తుంది. లంకాఫ్ ఠాణేలంక, గురజాపులంక, కూనాలంక తదితర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు ప్రవేశించింది. తహసీల్దార్ ఎం.సుబ్బలక్ష్మి లంక గ్రామాల్లో పర్యటించారు. వీఆర్వోలు స్థానికంగా ఉండి పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. లంక గ్రామాల్లో పశువుల నుంచి పాలు, వ్యవసాయ ఉత్పత్తులను తెచ్చుకునేందుకు కూనాలంక, గురజాపులంక, లంకాఫ్ ఠాణేలంకల వద్ద మెకనైజ్డ్ బోట్లను ఏర్పాటు చేశారు. ఈబోట్లలో రాకపోకలు సాగించే రైతులు విధిగా లైఫ్ జాకెట్లు ధరించాలని సూచించారు. ఇదిలా ఉండగా లంక ఇవతల ఉన్న అయినాపురంలో 450, కొత్తలంకలో 200, సోమిదేవపాలెంలో 200ఎకరాలు, సీహెచ్.గున్నేపల్లి, అనాతవరం గ్రామాల్లో మురుగుకాల్వ వెంబడి ఉన్న వరి పొలాలు నీట మునిగాయి. గోదావరి వరదనీరు ఉధృతంగా రావడం అవుట్‌ఫాల్ స్లూయిస్ తలుపులు మూసివేయడం, బొబ్బర్లంక-పల్లంకుర్రు ప్రధాన పంటకాల్వకు అయినాపురం మురుగుకాల్వ వద్ద ఉన్న సర్‌ప్లస్ వియర్ నుంచివస్తున్న మిగులు జలాలు, వర్షం ముంపు నీటితో వరి పొలాలు నీట మునిగాయి.

కాజ్‌వేను ముంచెత్తిన వరద

మామిడికుదురు, సెప్టెంబరు 6: వైనతేయ నదికి వరద ఉధృతి పెరుగుతుండడంతో అప్పనపల్లి కాజ్‌వేపై వరద నీరు చేరింది. మోకాలు లోతు నీరు కాజ్‌వేపైకి చేరడంతో అధికారులు కాజ్‌వే పైనుంచి రాకపోకలు నిలిపివేశారు. రాకపోకలు నిలిపివేయడంతో లంక గ్రామాలైన పెదపట్నంలంక, బి.దొడ్డవరం, అప్పనపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వ్యయ ప్రయాసలతో అప్పనపల్లి ఉచ్చులవారిపేట మీదుగా బాహ్య ప్రపంచానికి వస్తున్నారు. అప్పనపల్లి స్నానాలరేవు, బోడసకుర్రు వంతెన వద్ద వైనతేయ నది పరవళ్లు తొక్కుతుంది. వరద పెరుగుతున్న దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి తెలిపారు.

కోటిపల్లి వద్ద పెరిగిన గోదావరి ఉధృతి

కె.గంగవరం, సెప్టెంబరు 6: గోదావరి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో కోటిపల్లి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. కోటిపల్లి పుష్కరాల రేవులోని మెట్లపై వరకూ వరద నీరు చేరుకుంది. వరదలపై అప్రమత్తంగా ఉన్నట్లు తహసీల్దార్ కె.సూర్యారావు తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలో సిబ్బందినిఅప్రమత్తంగా ఉంచామన్నారు.

బోడసకుర్రులో మునిగిన 60ఇళ్లు

అల్లవరం, సెప్టెంబరు 6: భారీ వర్షాలకు వైనతేయ గోదావరి వరద క్రమేపీ పెరుగుతోంది. బోడసకుర్రు పల్లిపాలెంలో 60 మత్స్యకారుల ఇళ్లను వరద నీరు చుట్టుముట్టింది. పల్లిపాలెంలో వినాయక పందిరి వరద నీటిలో చిక్కుకుంది. తహసీల్దారు వీవీఎల్ నరసింహం, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ పరిస్థితిని సమీక్షించారు. బోడసకుర్రు సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎస్.దుర్గాశ్రీనివాస్, వీఆర్వోలు వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు.

నిలకడగా గోదావరి

పి.గన్నవరం, సెప్టెంబరు 6: గోదావరి వరద పెరుగుతూ తగ్గుతూ ప్రస్తుతం నిలకడగా కొనసాగుతుంది. గోదావరి ఎగువున ప్రస్తుతం తుగ్గుముఖం పట్టడంతో స్థానిక లంక గ్రామాల ప్రజానీకం ఊపిరిపీల్చుకున్నారు. ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి నిలకడగా ఉండటంతో దిగువున నదీపాయలు కొంతమేర శాంతించాయి. మానేపల్లి శివారు శివాయిలంక గ్రామానికి వెళ్లే రహదారిపై వరదనీరు ప్రవేశించడంతో లంక గ్రామస్తుల రాకపోకలు నిమిత్తం ట్రాక్టర్‌ను ఏర్పాటు చేశారు. గంటిపెదపూడి శివారు బూరుగులంక, పెదపూడిలంక, అరిగెలవారిపేట, ఉడిమూడి శివారు ఉడిమూడిలంక గ్రామస్తులు, పశ్చిమగోదావరి జిల్లా పెదమ ల్లంక, అనగర్లంక, అయోధ్యలంక తదితర లంకగ్రామాల ప్రజానీకం పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. చాకలిపాలెం వద్ద కాజ్‌వే నీట మునగడంతో ఆ ప్రాంత వాసులు నాటు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. బూరుగులంక నదీపాయతో పాటు శివాయిలంక రోడ్డు మునక ప్రాంతాలను తహశీల్దార్ పి.శ్రీపల్లవి పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

ఉధృతంగా గోదావరి పరవళ్లు

ఆలమూరు, సెప్టెంబరు6: గోదావరి ప్రవాహ ఉధృతితో బడుగువానిలంక, చెముడులంక, మడికి, చొప్పెల్ల, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు లంక భూముల్లో విలువైన వాణిజ్య పంటలు నీటమునిగాయి. జొన్నాడ వద్ద పుష్కర ఘాట్ నీట మునిగింది. అక్కడిఆలయాలు మునిగిపోయాయి. రెండు బ్రిడ్జిల మధ్య వరద ఉధృతిని ప్రజలు తిలకిస్తున్నారు.

గురుకుల బాలికలకు కలెక్టర్ అభినందన

రాజోలు, సెప్టెంబరు 6: రాజోలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులను శుక్రవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అభినందించారు. 9వ తరగతి విద్యార్థినులు ఎం.జోయల్‌మెర్సీ, సీహెచ్ వసంతలక్ష్మి, సీహెచ్ సౌభాగ్యలక్ష్మిలు వారధి ఫౌండేషన్ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మండల, జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ టి.లలితకుమారి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిబేట్ కాంపిటీషన్‌లో పదో తరగతి బాలికలు జె.కీర్తన, ఎస్.రత్నవల్లి, జె.స్నేహితలు ఫౌండేషన్‌వారు నిర్వహించిన పోటీల్లో రెండో స్థానంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. విద్యార్థినులను అమలాపురంలో టీచర్స్‌డే సందర్భంగా ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ), కలెక్టర్ మహేష్‌కుమార్, డీఈవో ఎం.కమలకుమారి సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

డిప్యూటీ సీఎం చిత్రపటం ఏర్పాటు

ముమ్మిడివరం, సెప్టెంబరు 6: జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు కర్రా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం, ఏడు సచివాలయాల్లో శుక్రవారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ, పార్టీ మండలాధ్యక్షుడు దూడల స్వామినాయుడు, అడబాల సతీష్‌కుమార్, మాదాల శ్రీధర్, పిల్లా మంగపతి, గొలకోటి సురేష్, యలమంచిలి బాలరాజు, గాలిదేవర బుల్లి, బండారు చిన్నా, పాయసం సాయి, గంటా వాసు, జగతా సతీష్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు సింగిల్ విండో అనుమతి

ఆత్రేయపురం, సెప్టెంబరు 6: వినాయక ఉత్సవాలను వైభవంగా నిర్వహించుకోవాలని, పందిళ్లలో విగ్రహాల ఏర్పాటుకు సింగిల్‌విండో అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నాతి బుజ్జి అధ్యక్షతన ప్రజాప్రతినిధులు, అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాధం, సర్పంచ్ మెర్ల రాము, గాదిరాజు రామకృష్ణంరాజు, ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రైల్వే లైన్‌పై ప్రజాభిప్రాయ సేకరణ జరపాలి

అమలాపురం రూరల్, సెప్టెంబరు 6: కొత్త రైల్వేలైన్ పనులను నిలుపుదల చేసి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని అల్లవరం, అమలాపురం రూరల్ మండలాలకు చెందిన రైతులు కోరుతున్నారు. పాత రైల్వే లైన్ ప్రకారమే పనులు చేయాలని కలెక్టర్‌కు ఇప్పటికే వినతిపత్రం అందజేశామన్నారు. చిందాడగరువు-రోళ్లపాలెం గ్రామాల మధ్యనున్న ఆర్‌డబ్ల్యుఎస్ మంచి నీటి పథకం ద్వారా 13 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోందని, సమీపంలో పురాతన ఆలయాలు, పుష్కర స్నానఘట్టాలు ఉన్నాయని, కొత్త రైల్వేలైన్ వల్ల పురాణ ప్రాశస్త్యం దెబ్బతింటుందని వివరిస్తూ శుక్రవారం ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ చినబాబుకు రైతులు వినతిపత్రం అందజేశారు. కొత్త రైల్వే లైన్ వల్ల మూడుచోట్ల జాతీయ రహదారిని క్రాస్ చేయాల్సి వస్తుందని, దీనివల్ల ట్రాఫిక్ సమస్యలతో పాటు ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ స్కీమ్‌కు తలెత్తే ఇబ్బందులను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఏఈ తెలిపారు. కార్యక్రమంలో బోడసకుర్రు, రోళ్లపాలెం, పేరూరు, చిందాడగరువు గ్రామాలకు చెందిన భూముల యజమానులు, రైతులు రంకిరెడ్డి సూర్యనారాయణ, అరవ గౌతమీ పూర్ణచంద్రరావు, సర్పంచ్ పొణకల గణేష్, మట్టా రామారావు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

హైస్కూల్ హెచ్ఎంపై మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు

ఆత్రేయపురం, సెప్టెంబరు 6: పేరవరం జడ్పీ హైస్కూలు హెచ్ఎం వ్యవహార శైలిపై విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాల నిర్వహణలో హెచ్ఎం అలసత్వం వహిస్తున్నారంటూ హైస్కూల్ నిర్వహణ కమిటీ చైర్‌పర్సన్ కుండ వెన్నెలతో పాటు గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు మంత్రి లోకేశ్‌తో పాటు కలెక్టర్, డీఈవోలకు ఫిర్యాదు చేశారు. హెచ్ఎం అందుబాటులో లేకపోవడంతో అదనపు భవనాల నిర్మాణం మధ్యలో నిలిచిపోయాయన్నారు. నిధులు డ్రా చేసేందుకు అందుబాటులో లేకపోవడంతో పాటు టీసీలు తీసుకోవడానికి విద్యార్థులు రోజుల తరబడి వేచియుండాల్సి వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

వినాయక చవితి వేడుకలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 6: అమలాపురం గొల్లగూడెంలోని ఆదిత్య స్కూలులో ప్రిన్సిపాల్ కె.లక్ష్మీదేవి ఆధ్వర్యంలో వినాయకచవితి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. వినాయకుని వేషధారణలో యశంత్ ఆకట్టుకున్నాడు. విద్యానిధిలో వినాయకచవితి విశిష్టతను వివరిస్తూ విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. వినాయకచవితి విశిష్టతను, గణపతి ఆవిర్భావాన్ని విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు వివరించారు. డైరెక్టర్ ఎ.శ్యామలామహాలక్ష్మి విద్యార్థులందరికీ వినాయకుని మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్
శ్రీలలిత	కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్క్రీన్-1	35 చిన్న కథకాదు
శేఖర్ స్క్రీన్-2	మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
రమా	ఆయ్
గణపతి	తంగలాన్
వెంకటపద్మావతిస్క్రీన్-1	సరిపోదా శనివారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	ఉరుకు పటేలా

జపాన్‌లో ఉద్యోగాలకు శిక్షణ

ముమ్మిడివరం, సెప్టెంబరు 6: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నావిస్ హెన్‌ఆర్ ఆధ్వర్యంలో ఏఎన్ఎం, జీఎన్ఎం, బీసీ నర్సింగ్ చదివిన వారికి జపనీస్ భాష ఎన్5, ఎన్4లతో పాటు ఎన్3 స్థాయిల్లో శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ తెలిపారు. 32ఏళ్లలోపువారు జపాన్ దేశంలో పనిచేయడానికి ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నావీస్ హెన్‌ఆర్ ఆధ్వర్యంలో ఆరు నెలల శిక్షణ ఇస్తారన్నారు. దీనికి సంబంధించి రూ.3లక్షలు ఫీజు, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50వేలు, దీనిలో రూ.25వేలు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చెల్లిస్తుందన్నారు. మిగిలిన రూ.25వేలు అభ్యర్థి చెల్లించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ ఫీజు రూ.3లక్షలు మూడు విడతలుగా అభ్యర్థి చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. శిక్షణ పూర్తిచేసిన వారికి జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కావాల్సిన సదుపాయాలు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావీస్ హెన్‌ఆర్ పర్యవేక్షిస్తాయని, శిక్షణ పూర్తయిన వెంటనే రూ.1.10లక్షల నుంచి రూ.1.40లక్షల వరకు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలను సెల్ 9581422339కు పంపించాలన్నారు.

14నుంచి రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 6: అమలాపురంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో ఈనెల14,15 తేదీల్లో 11వరాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్-2024 పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు తెలిపారు. మెట్రోకెమ్ అధినేత నండెపు వెంకటేశ్వరరావు(బాలాజీ) సౌజన్యంతో కోనసీమ పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్, హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల బ్రోచర్‌ను బాలాజీ శుక్రవారం ఆవిష్కరించారు. ఈపోటీలకు ఇప్పటికే400మందికిపైగా క్రీడాకారులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయించుకున్నారని అసోసియేషన్ కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు తెలిపారు. ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, నార్ని శ్రీను, పొణకల దుర్గాప్రసాద్, మట్టపర్తి సముద్రం, చిక్కం రాజబాబు, ఎం.వీరేంద్ర, ఎస్.భవానీ, జిమ్‌కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వినాయక చవితికి అన్ని చర్యలు తీసుకోవాలి

మలికిపురం, సెప్టెంబరు 6: వినాయక చవితి ఉత్సవాల మండపాల ఏర్పాటులో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ బి.సురేష్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, నిర్వాహకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీఎస్ రాజు, మండల పరిషత్ పరిపాలనాధికారి జి.మిల్టన్, ఆర్ఐ వేణు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

10న అమలాపురంలో జాబ్ మేళా

అమలాపురం టౌన్, సెప్టెంబరు 6: జిల్లా ఉపాధి కార్యాలయం, స్కిల్ డెవలెప్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రముఖ ప్రైవేటు కంపెనీల్లో పనిచేసేందుకు ఈనెల10న అమలాపురం మిరియం డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి ఇ.వసంతలక్ష్మి తెలిపారు. క్రెడ్‌రైట్ ఫైనాన్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 50, బ్యాంక్ ఆఫ్ బరోడాతో పాటు పేటీఎం తదితర సంస్థల్లో సేల్స్ ఆఫీసర్లు, ఇతర ఉద్యోగాలు 295, కేఎల్ గ్రూపులో వేర్‌హౌస్ అసోసియేట్ పోస్టులు 450 భర్తీ చేసేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు 10వ తేదీ ఉదయం 10.30 గంటలకు మిరియం డిగ్రీ కళాశాలకు చేరుకోవాలని, మరిన్ని వివరాలకు 8121838392 నెంబరును సంప్రదించాలన్నారు.

గురుకుల కళాశాలలో జడ్జి తనిఖీలు

అల్లవరం, సెప్టెంబరు 6: ముమ్మిడివరం మండలం లీగల్ సర్వీసెస్ సెల్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రెహ్మతుల్లా శుక్రవారం అల్లవరం మండలం గోడి బీఆర్ అంబేడ్కర్ బాలుర, బాలికల గురుకుల పాఠశాలలు, కళాశాలలను తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్లు, అటెండెన్స్ రిజిస్టర్లు, వసతి గృహాల గదులు, భవనాలు, స్టోరేజీ రూమ్‌లు, తరగతి గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు సరిపడా గదులు ఉన్నా యో లేదో ఆరా తీశారు. టాయిలెట్స్, తాగునీటి సదుపాయం, ఫ్యాన్లను పరిశీలించారు. సరైన ఆహారం ఇస్తున్నారా అని విద్యార్థులను అడి గారు. ప్రిన్సిపాల్స్ ఎన్.శ్రీనివాస్, కిరణ్మయి పాల్గొన్నారు.

ద్రాక్షారామ చేరుకున్న అయోధ్య రాముని ధనుస్సు



ద్రాక్షారామ, సెప్టెంబరు 6: అయోధ్య రామునికి అందజేయనున్న ధనుస్సు, బాణం శుక్రవారం ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి చేరుకున్నాయి. భీమేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. అయోధ్య భాగ్యనగర్ సీతారామసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకులు చల్లా శ్రీనివాసశాస్త్రి దేశవ్యాప్త ఊరేగింపులో భాగంగా ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి తీసుకువచ్చారు. 13కిలోల వెండి, కిలో బంగారంతో ధనుస్సు, బాణం తయారైనట్లు చెబుతున్నారు. కార్యక్రమంలో వాడ్రేవు సుందరరత్నాకరరావు, భక్తులు పాల్గొన్నారు.


రైలు ప్రయాణికుడికి గాయాలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రన్నింగ్‌లో ఉన్న రైలు దిగుతూ ఓ ప్రయాణికుడు ప్రమాదం బారిన పడ్డాడు. అయినవిల్లికి చెందిన విల్లా వినయ్‌కృష్ణ గోదావరి రైలులో రాజమండ్రి వచ్చాడు. రైలు 3వ ప్లాట్‌ఫాంకు ప్రవేశిస్తుండగా క్రూ లాబీ వద్ద దిగడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో జారి పడిపోవడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించామని జీఆర్పీ ఎస్ఐ మావుళ్లు తెలిపారు.

విద్యతోనే అభివృద్ధి

మలికిపురం, సెప్టెంబరు 6: విద్యతోనే అభివృద్ధి ముడిపడి ఉందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. లక్కవరం మంగెన గుర్రయ్య కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, సర్పంచ్ కోట పుష్పకుమారి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మహిళా ప్రధాన కార్యదర్శి మంగెన భూదేవి, కరస్పాండెంట్ సత్యప్రసాద్, ప్రిన్సిపాల్ శివాజీ, నిర్మల్ తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.5లక్షల విరాళం



మండపేట, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితులకు మండపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు సారధ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు రూ1.5లక్షల చెక్కును అంద జేశారు. చాంబర్ ప్రతినిధులు బొబ్బా రామకృష్ణ, సంకా పవన్, వాకచర్ల గుప్తా, రాంబాబు, అంకంబ్రహ్మం, జొన్నల చంద్రశేఖర్ పాల్గొన్నారు. అలాగే మండపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగభూషణం, కార్యదర్శి వెలగల శ్రీనివారెడ్డి, బొబ్బా రామకృష్ణలు రూ.70వేల చెక్కును ఎమ్మెల్యే వేగుళ్లకు శుక్రవారం అందజేశారు. ఆలమూరు తాలూకా రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.5లక్షల చెక్కును ఎమ్మెల్యే జోగేశ్వరరావుకు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఏఆర్ పోలీసులకు గాయాలు

ముమ్మిడివరం, సెప్టెంబరు6: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లు, ఇద్దరు యువకులు గాయపడ్డారు. కాకినాడకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ ఎం.సత్యనారాయణ, కానిస్టేబుల్ పి.మణికంఠకుమార్ గురువారం విధులు ముగించుకుని పల్సరు మోటారుసైకిల్‌పై అమలాపురం నుంచి కాకినాడ వెళ్తున్నారు. ముమ్మిడివరం టీడీపీ కార్యాలయం సమీపంలో వద్ద యానాం నుంచి మోటారుసైకిల్‌పై అమలాపురం వెళుతున్న మామిడికుదురుకు చెందిన కుంచే ప్రశాంత్‌కుమార్, అతని స్నేహితుడు ఏలూరుకు చెందిన పెరుమళ్ల విజయ్‌లు ఢీకొట్టారు. దీంతో ఏఆర్ కానిస్టేబుళ్లు ఇద్దరు గాయపడ్డారు. వారిని కాకినాడ అపోలో ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ యువకులను ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ఆత్రేయపురం, సెప్టెంబరు6: ర్యాలి గ్రామానికి చెందిన మెర్ల సత్తియ్య(53) రోజూ మద్యం తాగి ఇంటికి వస్తున్నాడు. గురువారం అతడిని భార్య ప్రశ్నించగా కోపంతో సమీపంలోని చెరువు వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి వాంతులు చేసుకున్నాడు. అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి కుమారుడు శేషారావు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఫాగింగ్ మిషన్ కొనుగోలుకు రూ.10వేలు విరాళం

రాయవరం, సెప్టెంబరు6: వెదురుపాక పంచాయతీకి ఫాగింగ్ మిషన్ కొనుగోలుకు శుక్రవారం విజయదుర్గాసేవాసమితి రూ.10వేలు నగదును పీఠాధిపతి గాడ్ కుమార్తె సత్యవెంకట కామేశ్వరి చేతులమీదుగా పంచాయతీ కార్యదర్శి ఎ.గోవిందరాజులకు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు బలిజేపల్లి రమ, పెద్దపాటి సత్యకనకదుర్గ, గాదే కృష్ణవేణి, వడ్డాది చిన్న కృష్ణంరాజు, గాదే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాద్‌నగర్ పర్యటనకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

ముమ్మిడివరం, సెప్టెంబరు6: గుజరాత్ రాష్ట్రంలోని వాద్‌నగర్‌లో పర్యటించేందుకు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి జి ఎం.కమలకుమారి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో మే నెలలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రేరణ పోటీల్లో ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. కె.గంగవరం మండల దంగేరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మల్లిపూడి సాయివెంకటగణేష్, మండపేట జవహర్ మున్సిపల్ హైస్కూలు విద్యార్థిని శివనవ్యశ్రీలు ఎంపికైనట్టు తెలిపారు. వీరికి ఎస్కార్ట్ టీచరుగా మండపేట మండలం ద్వారపూడి బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని కె.కల్యాణి ఎంపికయ్యారన్నారు.విద్యార్థులు ఎస్కార్ట్ టీచరుతో కలిసి ఈనెల19న వాద్ నగర్ పర్యటనకు వెళతారన్నారు. వారం రోజులు వాద్‌నగర్‌లో పర్యటించి విద్యార్థులు తిరిగి ఈ నెల30న వస్తారన్నారు. ప్రయాణటిక్కెట్లను పెద్దాపురం జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ ఎం.కృష్ణయ్య శుక్రవారం ముమ్మిడివరంలో డీఈవో కార్యాలయంలో డీఈవో ఎం.కమలకుమారికి అందజేశారు. ప్రేరణ జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరించిన సమగ్ర శిక్ష ఏఎంవో పి.రాంబాబు జవహర్ నవోదయ అధ్యాపకుడు సత్యనారాయణ, అప్పారావు ఉన్నారు.